# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 7 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 12 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :7 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 12 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# శాంతిభద్రతలే లక్ష్యం

## 'త్రిశూల్' ఆపరేషన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం

- 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- డ్రగ్స్, మహిళలపై వేధింపులు, రోడ్డు ప్రమాదాల నిర్మూలనే లక్ష్యం
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై కఠిన చర్యలకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో నేరాల రేటు 14 శాతం తగ్గిందన్న ముఖ్యమంత్రి
- రోడ్డు ప్రమాదాల్లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆవేదన




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కార్యాచరణకు ఆయన శ్రీకారం చుట్టారు. 'జీరో డ్రగ్స్, మహిళలపై వేధింపుల పట్ల జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు' లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'త్రిశూల్' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, వ్యవస్థీకృతంగా సాగుతున్న వేధింపులపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఈ అంశాలపై మంత్రుల కమిటీ లోతైన అధ్యయనం చేస్తుందని ఆయన తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 30 మంది కానిస్టేబుళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి

- మిగతా 2లో

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు డెడ్‌లైన్లు..
### ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు



- మార్చి 2027 నాటికి దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం
- 2027 మార్చి నాటికి 5.32 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- 2028 డిసెంబర్‌కల్లా ప్రతి గ్రామీణ ఇంటికి కుళాయి కనెక్షన్
- 2027 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధన.. 50 లక్షల మంది యువతకు ఏఐలో శిక్షణ



## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్

- డీఎస్సీతో 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్న కేశినేని చిన్ని
- డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని విమర్శ
- ఐదేళ్ల పాలనలో జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

- మిగతా 2లో



## అల్పపీడన ప్రభావంతో ఏపీలో వర్షాలు..

### అప్రమత్తమైన ప్రభుత్వం

పెన్ పవర్ డెస్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతం కావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున

- మిగతా 2లో

## ఏపీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
## రెండు డీఏలు విడుదల

- సెప్టెంబరు జీతంతో పెంచిన డీఏ
- 2025 జనవరి నుంచి 1.82 శాతం డీఏ అమలు
- 2024 జులై నుంచి 2.73 శాతం డీఏ
- 2028లో 1.82 శాతం డీఏ బకాయిలు
- పింఛనుదారులకూ ఇదే షెడ్యూల్‌లో బకాయిలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రెండు డీఏలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ

- మిగతా 2లో




## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ

- మిగతా 2లో






## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

### హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన

- మిగతా 2లో



## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్..

### 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్
- జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి
- ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి
- జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన
- బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన

- మిగతా 2లో

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు.

- మిగతా 2లో




## మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ

పెన్ పవర్ డెస్క్: ఫాస్టాగ్ కారణంగా టోల్‌ప్లాజాల వద్ద వేచి చూసే సమయం గణనీయంగా తగ్గిందని, వచ్చే ఏడాది నుంచి అసలు ఆగే అవసరమే ఉండదంటున్నారు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2027 మార్చి కల్లా బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు

- మిగతా 2లో

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి

- మిగతా 2లో

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం

- ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం
- తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం విధింపు
- సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి వచ్చిన ఉత్తర్వులు

పెన్ పవర్ డెస్క్:ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# మాధవ్ మాట వింటారా? అందరూ సీతయ్యలేగా?

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ కు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్ గా మారనున్నాయి. అన్ని రకాల వత్తిడిలు ఆయన ఎదుర్కొనాల్సి ఉంటుంది. ఒకవైపు రాష్ట్రంలో కూటమిలోని మిత్ర పక్షాలతో సమన్వయం చేసుకుని వెళ్లడం, మరొకవైపు సొంత పార్టీ నేతలను సంతృప్తిపర్చడం మాధవుడికి ఛాలెంజ్ అని చెప్పాలి. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయిన తర్వాత జరిగే తొలి ఎన్నికలు కావడంతో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మరొకవైపు కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ ఎదగలేదు. అలాగే పొత్తు లేకుండా గెలిచే సీన్ లేదు. ఆ సంగతి తెలిసినా కేంద్ర నాయకత్వం దృష్టిలో ఈ ఎన్నికల ఫలితాలు తన నాయకత్వం సామర్థ్యంపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలో మాధవ్ ఉన్నారని అంటున్నారు. నేతలు మాధవ్ కు సహకరించే విషయంలో కూడా తక్కువేనని చెప్పాలి.

**పార్టీ బలోపేతానికి...**

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎక్కువ స్థానాలపై పట్టు సాధించడమే బీజేపీ ప్రధాన వ్యూహంగా ఉంది. బీజేపీ రాష్ట్రంలో నాలుగు జోన్లుగా విభజన చేసి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఎన్నికల నిర్వహణ, వ్యూహ రచన కోసం రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమనాలుగు జోన్లుగా విభజించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ స్ట్రాటజీ ప్రకారం సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. విశాఖ, రాజమండ్రి, తిరుపతి, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు మరియు జెడ్పీ స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఢిల్లీ అధిష్టానం రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేసింది.

**సీనియర్ నేతలను...**

కూటమి ధర్మం పాటిస్తూనే, పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేలా సీట్ల సర్దుబాటుపై జనసేన, టీడీపీలపై బీజేపీ ఒత్తిడి పెంచుతోంది.శక్తి కేంద్రాలు, మ్యానిఫెస్టో ప్రచారం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రాష్ట్రంలో పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. మరొకవైపు పార్టీలో నేతలందరూ సీనియర్లు. వారు ఎవరి మాట వినరు. దాదాపు అందరూ సీతయ్యలే. అందుకే నాయకులను సమన్వయం చేసుకుని ప్రజల వద్దకు వెళుతూ పార్టీని బలోపేతం చేయాలంటే ఒక్క అధ్యక్షుడి వల్ల కాదు. సమిష్టిగానే పార్టీ ఎదుగుదల, విజయం సాధ్యమవుతుంది. కానీ ఓటమి మాత్రం మాధవ్ ఖాతాలో పడే అవకాశముంది. అందుకే మాధవ్ లో అలజడి మొదలయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుకున్న స్థానాలను సాధించడంతో పాటు గెలిపించుకోవడం కూడా అతి పెద్ద సమస్య మాధవ్ ముందుంది. మరి దీనిని ఎలా అధిగమిస్తారన్నది చూడాలి.

### ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

## హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# కలెక్టర్లకు సీఎం చంద్రబాబు డెడ్‌లైన్లు.. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు

రాష్ట్రంలో పాలనను గాడిన పెట్టే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రతి శాఖకు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశిస్తూ, వాటిని పూర్తి చేయడానికి కచ్చితమైన గడువును ఖరారు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం నుంచి అభివృద్ధి పనుల వరకు ప్రతి అంశంలోనూ వేగం పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన భూ వివాదాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. దీర్ఘకాలిక భూ సమస్యలను 2027 మార్చి నాటికి పూర్తిగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సెక్షన్-22ఏ దరఖాస్తులను 2026 అక్టోబర్ నాటికి క్లియర్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గృహ నిర్మాణం రంగంలో భాగంగా, 2027 మార్చి నాటికి 5.32 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని స్పష్టం చేశారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. 2028 డిసెంబర్ నాటికి ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని సూచించారు. తాగునీటి సరఫరాకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, జలవనరులను పునరుద్ధరించాలని జలవనరుల శాఖకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్య, ఉపాధి రంగాలపై ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. 2027 నాటికి రాష్ట్రంలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలని, 50 లక్షల మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. పరిశ్రమలను ప్రోత్సహించడం, 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడం, ఎంఎస్ఎంఈ పార్కులలో మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని సూచించారు. ఇంధన రంగంలో భాగంగా 9 లక్షల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ లక్ష్యాలన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు.ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు.పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది.

మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

# శాంతిభద్రతలే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

విస్తృత ప్రచారం కల్పించాలని, విశాఖపట్నం, తిరుపతి, అమరావతి నగరాల్లో డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, ప్రతి ప్రమాదాన్ని క్షుణ్ణంగా ఆడిట్ చేసి, అందుకు గల కారణాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు.గత రెండేళ్లలో రాష్ట్రంలో నేరాలు 14 శాతం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 29.2 శాతం తగ్గాయని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం శిక్షల ఖరారు రేటు (కన్విక్షన్ రేటు) 47 శాతంగా ఉందని, దీనిని మరింత పెంచాలని సూచించారు. నేరం జరిగిన 30 నిమిషాల్లోపే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలని, కేసుల సత్వర పరిష్కారానికి 'వన్ కోర్టు-వన్ కానిస్టేబుల్' విధానాన్ని పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు.బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు.బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

# పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్

- మొదటి పేజి తరువాయి

డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో

ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

# ఏపీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలు విడుదల

- మొదటి పేజి తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డీఏలను సెప్టెంబరు నెల జీతంతో కలిపి చెల్లించాలని ఆదేశించింది. 2025 జనవరి 1 నుంచి 1.82 శాతం డీఏ అమల్లోకి రానుంది. దీనికి సంబంధించిన 20 నెలల బకాయిలను 2028లో నాలుగు విడతల్లో చెల్లించనున్నారు. జనవరి, మార్చి, మే, జులై నెలల్లో బకాయిలు జమ చేయనున్నారు.అలాగే 2024 జులై 1 నుంచి 2.73 శాతం డీఏ చెల్లించనున్నారు. దీనికి సంబంధించిన 26 నెలల బకాయిలను 2027లో నాలుగు విడతల్లో అందించనున్నారు. ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబరు నెలల్లో బకాయిలు చెల్లించనున్నారు.

పింఛనుదారులకు కూడా ఇదే విధానంలో డీఏ బకాయిలను

చెల్లించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఉద్యోగులు, పింఛనుదారులకు సెప్టెంబరు జీతంతోనే పెరిగిన డీఏ ప్రయోజనం అందనుంది.

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం

- మొదటి పేజి తరువాయి

వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది.పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(ఘ) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం

- మొదటి పేజి తరువాయి

ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు.బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు.

బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

# మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ

- మొదటి పేజి తరువాయి

అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ముబయిలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆయన మాట్లాడారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు.టోల్‌బూత్‌ల వద్ద ఒకప్పుడు సగటున 12 నిమిషాలు వేచి ఉండాల్సి వచ్చేదని గడ్కరీ అన్నారు. కొన్ని సందర్భాల్లో 30 నిమిషాలు కూడా పట్టేదన్నారు. ఫాస్టాగ్ ) కారణంగా ఈ సమయం 80-90 శాతం తగ్గిందని తెలిపారు. బ్యారియర్లు లేని టోల్‌బూత్‌ల వల్ల ఆ సమయం ఇంకా తగ్గుముఖం పడుతుందని మంత్రి వివరించారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు ఏటా రూ.10వేల కోట్లు ఆదాయం అదనంగా ప్రభుత్వానికి సమకూరుతుందన్నారు. వార్షికంగా సుమారు రూ.5,250 కోట్ల మేర ఇంధనం కూడా ఆదా అవుతుందని చెప్పారు.బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కొనసాగుతోందని గడ్కరీ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 శాతం టోల్‌బూత్‌ల వద్ద అడ్డంకులు తొలగనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా నూరు శాతం పూర్తవుతుందన్నారు. ప్రతిపాదిత విధానంలో మానవ ప్రమేయం లేకుండానే టోల్ వసూలు సాధ్యం కానుందని చెప్పారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఘాచ్పీూ=) సాంకేతికతను ఫీూాఝుస్త్ర ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్‌తో అనుసంధానించడం ద్వారా టోల్ చెల్లించడానికి వాహనం ఆగకుండానే ఫీజు వసూలు పూర్తవుతుందని వివరించారు.

### అల్పపీడన ప్రభావంతో ఏపీలో వర్షాలు..

# అప్రమత్తమైన ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని హోం మంత్రి సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.

# కొత్త పెన్షన్ దరఖాస్తుల గడువు పెంచాలి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**కొత్త పెన్షన్ల కోసం ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ గడువును ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మరో 14 రోజులు పొడిగించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొర్ర రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు.గూడెంకొత్తవీధిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొత్త పెన్షన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో అవసరమైన ధ్రువపత్రాల సమీకరణ, దరఖాస్తుల నమోదు ప్రక్రియకు సమయం పడుతోందన్నారు. ప్రస్తుత గడువు తక్కువగా ఉండటంతో కొంతమంది అర్హులు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.అర్హులందరికీ అవకాశం కల్పించేందుకు కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.



పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## అన్నా క్యాంటీన్ లలో ఆహార నాణ్యత సిబ్బంది పనితీరు పై:పర్యవేక్షణ



### చేపట్టిన మెప్మా డిఆర్పి చిల్లా విజయలక్ష్మి

విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 11: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నా క్యాంటీన్ల పనితీరు ఆహార పదార్థాల నాణ్యత,అన్న క్యాంటీన్ సిబ్బంది ప్రజలతో సత్సంబంధాల అవగాహన మరియు పర్యవేక్షణ మెప్మా డి ఆర్ పి చిల్లా జయలక్ష్మి ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ నిర్వహించారు. నగరంలో ఉన్న అన్న కెంట్ తో పాటు కేజీహెచ్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ ను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ శర్మ గారు,పార్టీ ప్రెసిడెంట్ సి ఎం రమణ,సూపర్వైజర్ అప్పలరాజు. పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటర్ల జాబితా ప్రదర్శన

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 12:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను గూడెంకొత్తవీధి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రదర్శించారు. ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఈ జాబితాను ప్రదర్శించారు.పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను ఆయా పంచాయతీ కేంద్రాల్లో ప్రదర్శించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు ఎంపీడీవో తెలిపారు.రేపటి నుంచి సంబంధిత పంచాయతీ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఇమ్మానుయేల్, డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ కార్యదర్శి కిట్లంగి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం



- ఐఏటీఓ సదస్సులో మంత్రి కందుల దుర్గేష్
- టూర్ ఆపరేటర్లు, హోటల్ ప్రతినిధులతో విస్తృత చర్చలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా, గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖప ట్నంలోని నోవోటెల్‌లో జరుగుతున్న ఇండియన్ అసోసియే షన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీఓ) 41వ వార్షిక సదస్సు రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా టూర్ ఆపరేటర్లు, ప్రము ఖ హోటల్ గ్రూపులు, విమానయాన సంస్థల ప్రతినిధులతో మంత్రి విస్తృతంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, గిరిజన పర్యాటకానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 'స్ట్రాంగర్ టుగెదర్' నినాదంతో పర్యాటక శాఖ, టూర్ ఆపరేటర్లు, విమానయాన సంస్థలు, హోటల్ యాజమాన్యాలు కలిసి పనిచేసి పర్యాటకులకు సరికొత్త అనుభూతులను అందించాలని పిలుపునిచ్చారు.

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని శైవ క్షేత్రాలు, దివ్య క్షేత్రాలు, పంచారామాలు, గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాలను అనుసంధానిస్తూ ప్రత్యేక ఆధ్యాత్మిక టూర్ ప్యాకేజీలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులకు ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు ఆహ్లాదకరమై న అనుభూతిని కలిగించేలా ప్యాకేజీలను రూపొందించి పుష్కరాలను విజయవంతం చేయాలని కోరారు.

ఏపీలో 7 స్టార్ హోటళ్ల ఏర్పాటుకు లీలా గ్రూప్ ఆసక్తి

సదస్సులో భాగంగా లీలా గ్రూప్ ప్రతినిధులు మంత్రి కందుల దుర్గేష్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రపంచస్థాయి 7 స్టార్ హోటళ్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి, సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక, ఆతిథ్య రంగాల అభివృద్ధికి ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

వియత్నాం నుంచి ఏపీకి విమాన సర్వీసులు

వియత్నాం ట్రావెల్ అసోసియేషన్ ప్రతినిధులతోనూ మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వియత్నాం నుంచి ఆంధ్ర ప్రదేశ్‌కు నేరుగా విమాన సర్వీసులు నడిపేందుకు 'సన్ ఫుకెట్ ఎయిర్‌లైన్స్' సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించి ముందడుగు వేస్తామని చెప్పారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఓపెన్ స్కై ఎయిర్‌పోర్ట్ గా అభివృద్ధి చేసే దిశగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.గిరిజన పర్యాట కానికి ప్రత్యేక సర్క్యూట్లు

హాలిడే వరల్డ్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో గిరిజన ప్రాంతాలను అనుసంధానిస్తూ రూపొందిస్తున్న 'ట్రైబల్ సర్కిల్' ప్యాకేజీలపై చర్చించారు. గిరిజన సంస్కృతి, జీవన విధానం, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక పర్యా టక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు.

హోటల్, విమానయాన సంస్థలతో విస్తృత చర్చలు

జీఆర్‌టీ హోటల్స్, ది పార్క్, ఐటీసీ, తాజ్, రాడిసన్ బ్లూ, నోవోటెల్, లెమన్ ట్రీ, బెస్ట్ వెస్ట్రన్ ప్లస్, ఫార్చ్యూన్, జింజర్, రాయల్ పోర్ట్, గాదిరాజు ప్యాలెస్, డాల్ఫిన్, గ్రీన్ పార్క్ తదితర హోటల్ గ్రూపుల ప్రతినిధులతో మంత్రి సమావేశమ య్యారు. ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్, ఇతర పర్యాటక సంస్థల ప్రతినిధులతోనూ చర్చించారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం, ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పర్యాటక రంగ వృద్ధిని వేగవంతం చేయడం, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టూర్ ఆపరేటింగ్ విధానాలు, విధాన నిర్ణయాలు, సందర్శకుల నిర్వహణ, సుస్థిర పర్యాటక అభివృద్ధి వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చలు జరిగాయి.

కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా, ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అమృత్ అభిజాత్, ఏపీ పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్.ఎస్. రావత్, పర్యాటక శాఖ ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్, ఐఏటీఓ అధ్యక్షుడు రవి గోసైన్, పర్యాటక రంగ నిపుణులు, వివిధ రాష్ట్రాల పర్యాటక శాఖల ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు, హోటల్, విమానయాన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతరం ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఢిల్లీ తదితర రాష్ట్రాల పర్యాటక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను సందర్శించారు.

## బాక్సింగ్ బరిలో విశాఖ కుర్రోడి"బంగారు పంచ్!'

### బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన 13వ వార్డు యువకుడు కొండ గౌతమ్




**విశాఖ తూర్పు,పెన్ పవర్ సెప్టెంబర్ 11:**అమరావతి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం యువకుడు తన పంచ్ పవర్ తో సత్తా చాటాడు. ప్రత్యర్థులను చిత్తు చేసి బంగారు పతకాన్ని ముద్దాడాడు.విశాఖ తూర్పు నియోజకవర్గం 13వ వార్డు సెక్టార్-4 కు చెందిన కొండ శ్రీనివాస్-వరలక్ష్మి దంపతుల కుమారుడు కొండ గౌతమ్ అమరావతి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ విజయం 13వ వార్డుకే కాకుండా విశాఖ తూర్పు నియోజకవర్గానికే గర్వకారణంగా నిలిచింది.గోల్డ్ మెడల్ సాధించిన గౌతమ్ తన మెడల్, సర్టిఫికెట్ ను విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు చేతుల మీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతమ్ ను అభినందిస్తూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో విశాఖ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో 13వ వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, తెలుగు యువత అధ్యక్షులు వడిసెల శ్రీను,16వ బూత్ కన్వీనర్ ఓశెట్టి పైడిరాజు తదితరులు పాల్గొని గౌతమ్ ను అభినందించారు.

## దేవరపల్లి సచివాలయంలో సమయపాలన ఏదీ?

### మధ్యాహ్నం 12 దాటినా రాని సిబ్బంది.. పింఛన్ దరఖాస్తుదారుల అవస్థలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించాలని ఉన్నతాధికారులు పదేపదే సూచిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. గూడెంకొత్తవీధి మండలంలోని దేవరపల్లి సచివాలయంలో శుక్రవారం సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పింఛన్ దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పలువురు వృద్ధులు, అర్హులైన దరఖాస్తుదారులు ఉదయాన్నే సచివాలయానికి చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం 12 గంటలు దాటినా సిబ్బంది కార్యాలయానికి రాకపోవడంతో దరఖాస్తుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కార్యాలయం తలుపులు తెరవకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పింఛన్ దరఖాస్తుల స్వీకరణకు పరిమిత గడువు ఉన్న సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు వచ్చే ప్రజలకు నిర్ణీత సమయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.దేవరపల్లి సచివాలయంలో చోటుచేసుకున్న ఈ పరిస్థితిపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించి, వాస్తవాలను పరిశీలించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని



ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై ఎంపీడీవో వివరణ కోరగా, ఘటనపై విచారణ చేపట్టి వాస్తవాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీలకు సౌర వెలుగులు.. 100% లక్ష్యంగా ముందడుగు

### కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబుకు వివరించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ సౌకర్యాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం సూర్యఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' పథకాన్ని విశాఖపట్నం జిల్లాలో వేగవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు.అమరావతిలో శుక్రవారం జరిగిన 8వ కలెక్టర్ల సదస్సు రెండో రోజు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లాలో పథకం అమలు తీరును కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు.జిల్లాలో ఇప్పటివరకు 60 శాతం రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్త యిందని, మిగిలిన పనులను వేగవంతం చేసి త్వరలోనే 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. సంబంధిత నోడల్ ఏజెన్సీ, ఈపీడీసీఎల్ అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించి, అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పథకం ద్వారా లబ్ధి పొందే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# పింఛన్ దరఖాస్తులకు గడువు పెంచాల్సిందే!



- సర్వర్ సమస్యలతో సచివాలయాల్లో నిలిచిన ఆన్‌లైన్ ప్రక్రియ.
- అర్హులకు అన్యాయం చేయొద్దు.
- అందరికీ సమన్యాయం చేయండి.
- సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్.

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 11.** కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం చౌడు పల్లి పంచాయతీ,వాముగడ్డ2 సచివాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తక్కువ గడువు, వరుస సెలవులు, సర్వర్ సమస్యల కారణంగా అర్హులైన పేదలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త పింఛన్ల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. అయితే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు సదరం సర్టిఫికెట్లు, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలను సమకూర్చుకునేందుకు గడువు సరిపోవడం లేదన్నారు. కనీసం మరో 10 నుంచి 15 రోజులపాటు గడువు పొడిగించాలని కోరారు.

**హౌస్‌హోల్డ్ సర్వేతో అర్హులకు అన్యాయం.**

గతంలో ఒకే కుటుంబంలో ఉండి రేషన్ కార్డు పొందిన కుటుంబాలు ప్రస్తుతం విడిపోయి ప్రత్యేకంగా రేషన్ కార్డులు పొందినప్పటికీ, హౌస్‌హోల్డ్ సర్వేలో ఒకే కుటుంబంగా చూపించడం వల్ల అర్హులైన వారికి పింఛన్లు దక్కడం లేదని చిరంజీవి తెలిపారు. ప్రత్యేకంగా నివసిస్తున్న కుటుంబాలను హౌస్‌హోల్డ్ సర్వేలో వేర్వేరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**వరుస సెలవులు.సర్వర్ సమస్యలు.**

ఈ నెల 12, 13, 14 తేదీల్లో వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు ఆన్‌లైన్, సచివాలయాలను ఆశ్రయించడంతో సర్వర్లపై భారం పెరిగి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మండలంలోని సచివాలయాల్లో గత ఐదు రోజులుగా పింఛన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సక్రమంగా సాగడం లేదన్నారు.

అర్హులైన ఒక్కరూ నష్టపోకుండా పింఛన్ల దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించి, సర్వర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు లోచేల రాజారావు, గసు ముల చిన్నలదొర, కే.లక్ష్మణరావు,కంకిపాటి మల్లు పడాల్, అరుడ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి డివిజనల్ అటవీ శాఖ కార్యాలయం లో ఘనం గా జాతీయ అటవీ శాఖ అమర వీరులు సంస్మరణ దినోత్సవం.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 11.** విధి నిర్వహణ లో అసువులు బాసిన అటవీ అమర వీరులకు చింతపల్లి డివిజన్ అధికారి వై.వి నరసింహారావు, అటవీ సిబ్బంది ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ నరసింహారావు మాట్లాడుతూ అమర వీరుల త్యాగం మరువలేని అని, వారి త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు దీనికి నిదర్శనమే ఘనమైననివాళి అన్నారు.అనంతరం అటవీ శాఖ సిబ్బంది భారీ ర్యాలీ చింతపల్లిలో నిర్వహించారు.ఈ కార్యక్రమం లో రేంజ్ అధికారులు బి.అప్పారావు, ఎస్.వెంకట్రావు, జె. ప్రశాంతి కుమారి, కె. మణికృష్ణ, డి .వెంకటరాజు,ఏపీ జూనియర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం . సింహాచలం మరియు అటవీ సిబ్బంది, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.కె మస్తాన్ వల్లి, భాగ్యరాజు గారు పాల్గొన్నారు.

## రిసార్టుల్లో నిబంధనలు మీరితే కఠిన చర్యలు.

- అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వొద్దు.
- లంబసింగి రిసార్ట్ నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 11.** ప్రముఖ పర్యాటక కేంద్రమైన లంబసింగికి రాబోయే శీతాకాలంలో పర్యాటకుల తాకిడి పెరగనున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. రిసార్టుల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని చింతపల్లి సబ్ డివిజనల్ డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సింహాచలం హెచ్చరించారు. గురువారం తమ కార్యాలయంలో లంబసింగి పరిసర ప్రాంతాల రిసార్టుల యజమానులు, పర్యవేక్షకులతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా భార్యాభర్తలు, పిల్లలతో వచ్చే కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. రిసార్టుల్లో మద్యం సేవించడాన్ని పూర్తిగా నిషేధించాలని, యువకులు లేదా ఇతర బృందాలు వచ్చినప్పుడు వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రతి రిసార్టులోనూ తప్పనిసరిగా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులు ఆదేశించారు. రిసార్టుకు వచ్చే పర్యాటకుల గుర్తింపు కార్డుల కాపీలను విధిగా సేకరించి, వారి పూర్తి వివరాలను, ఫోన్ నంబర్లను రిజిస్టర్లలో నమోదు చేయాలనీ, ప్రవేశ ద్వారం, పార్కింగ్, కారిడార్లు తదితర కీలక ప్రాంతాల్లో 24 గంటల పాటు పనిచేసేలా సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు, కనీసం నెల రోజుల ఫుటేజీని భద్రపరచాలని సూచించారు. అలాగే చీకటి పడ్డాక ఆవరణలో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానికులకు, పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా రాత్రి 10 గంటల తర్వాత భారీ శబ్దాలతో కూడిన డీజేలు, లౌడ్ స్పీకర్లను పూర్తిగా నియంత్రించాలని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రిసార్ట్ నిర్వాహకులకు ఆదేశించారు.

## రైతులకు 90 శాతం సబ్సిడీపై రాజ్మా విత్తనాలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ-2 పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై రాజ్మా విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ పొట్టిక సింహాచలం ఆధ్వర్యంలో సుమారు 55 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలను రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా రైతులు సబ్సిడీపై అందుతున్న రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకొని సాగులో మంచి దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, కొయ్యం సిద్ధు, గబులంగి గణేష్, టీడీపీ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరభన్నదొర, ఓంద్రంగి సత్యనారాయణ, సంజీవరావు, పాంగి కృష్ణ, గెమ్మెల్ పల్స్, గుంటకొట్టి తదితరులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పాడేరు పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. జయరాజు కన్నుమూత

**జిల్లా అధికారులు, సిబ్బంది సంతాపం**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** పాడేరు డివిజన్ పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా 2025 జూలై నుంచి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. జయరాజు శుక్రవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పశువర్ధక శాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు.డాక్టర్ జయరాజు భౌతికకాయాన్ని ఆయన స్వస్థలమైన కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపార్రు గ్రామానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.విధుల పట్ల నిబద్ధతతో పనిచేసిన అధికారిగా డాక్టర్ జయరాజు పాడేరు డివిజన్ పరిధిలో అందించిన సేవలను అధికారులు, సిబ్బంది ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. డాక్టర్ జయరాజు మృతి పట్ల జిల్లా అధికారులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



**మండల, గ్రామస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపాలి**

**పీజీఆర్ఎస్‌కు 226 అర్జీలు**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించకుండా, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ అధికారులను ఆదేశించారు.పాడేరులోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌కు మొత్తం 226 అర్జీలు అందాయి. వీటిలో పీజీఆర్ఎస్‌కు 149, రెవెన్యూ క్లినిక్‌కు 77 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, ఆర్డీవో ఎం. భుజంగరావు, జిల్లా అధికారులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామస్థాయి పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యలు జిల్లా స్థాయికి రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ప్రతి శుక్రవారం జిల్లా స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు సంబంధిత జిల్లా అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని, అనివార్య పరిస్థితుల్లో ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను బాధ్యతగా వివరించాలని సూచించారు.భూ సంబంధిత ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సంబంధిత భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ రికార్డుల్లోని సమాచారంతో సరిపోల్చి సమస్యలను పరిష్కరించాలని జేసీ తెలిపారు. ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు పరిధిలోని ప్రజలతో అధికారులు మాట్లాడి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, అలాగే మీకోసం ద్వారా ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.శుక్రవారం అందిన అర్జీలలో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 77, డీఎస్‌జీఎస్‌డబ్ల్యూఓ కార్యాలయానికి 60, పీఆర్--ఆర్‌డబ్ల్యూఎస్--ఇంజనీరింగ్ శాఖలకు 28, గురుకులం--సర్వశిక్షా అభియాన్‌కు 23 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విద్య, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, విద్యుత్, గృహ నిర్మాణం, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఆర్ఓఎఫ్ఆర్, పెన్షన్లు, రోడ్లు--భవనాలు, ఐటీడీఏ, వైద్య తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా అందాయి. కార్యక్రమంలో పలువురు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్ దరఖాస్తుదారులకు జనసేన నేత సహకారం




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** మండలంలోని జర్రెల పంచాయతీలో కొత్త పెన్షన్ దరఖాస్తుదారులకు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి సహకారం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన కొత్త పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన గత నాలుగు రోజులుగా స్థానిక సచివాలయంలో అందుబాటులో ఉంటున్నారు. పెన్షన్ కోసం వచ్చే వృద్ధులు, అర్హత కలిగిన దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించడంలో సహకరిస్తూ, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తుల్లో తప్పులు లేకుండా జాగ్రత్తలు సూచిస్తూ, అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారు. పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ సమయంలో సచివాలయానికి వచ్చే వారికి విష్ణుమూర్తి అందిస్తున్న సహకారం ఉపయోగకరంగా ఉందని పలువురు దరఖాస్తుదారులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన వారు గడువులోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఫ్రైడే--డ్రైడే తో దోమలకు చెక్

**సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: హేమావతి**



**పెన్ పవర్, సెప్టెంబర్ 11:** ఎం సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా జీవీఎంసీ వెస్ట్‌జోన్ 59వ వార్డు పరిధి వాయుపుత్ర కాలనీలో శుక్రవారం మల్కాపురం ఏరియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే--డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌జోన్ కమిషనర్ హేమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరి యా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుం డా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో, పరిసరాల్లో మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఫ్రిజ్ వెనుకభాగంలోని డ్రాప్ బాక్సులు, పూలకుండీల కింద ప్లేట్లు, మనీ ప్లాంట్లు, కూలర్లు, సిమెంట్ కుండీలు, డ్రమ్ములు, డాబాలపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను తరచూ పరిశీలించాలని సూచించారు. రెండు రోజులకు మించి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు.ఇళ్ల పరిస రాల్లో పడేసిన కొబ్బరి బొండాలు, డిస్పోజబుల్ గ్లాసులు, మూతలు లేని సీసాలు, టైర్లు, ఇతర పనికిరాని వస్తువులను వెంటనే తొలగించాలని కోరారు. అటకలు, డాబాలపై పేరుకు పోయిన పనికిరాని సామగ్రిని కూడా తొలగించాలన్నారు.

ప్రతి శుక్రవారం, మంగళవారం ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించి, పాత్రలను కొంతసేపు ఆరబెట్టిన అనంతరం తాజా నీటిని నింపుకోవాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకర, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేర్వేరుగా విభజించి ప్రతిరోజూ ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ వాహనాలకు అందజేయాలని తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హేమావతి హెచ్చరిం చారు.

ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్, మలేరియా సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐదు లీటర్ల నాటు సారాయితో వ్యక్తి అరెస్టు.



**కురుపాం సెప్టెంబర్ 11 పెన్ పవర్.** నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధి గుమ్మలక్ష్మీపురం మండలం కొల్లిగూడ గ్రామ సమీపంలో శుక్రవారం నాడు కురుపాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్,పి.శ్రీనివాసరావు.ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.ఈ మేరకు ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ,కొల్లి గూడ గ్రామానికి చెందిన లాభాల శేఖర్ నాటు సారా విక్రయిస్తుండగా ఈ ఐదు లీటర్ల నాటు సారాయితో అరెస్టు చేసామని,అరెస్టు చేసి న్యాయ స్థానం ముందు హాజరు పరచామన్నారు.లాభాల శేఖర్ కి న్యాయ స్థానం 14 రోజులు రిమాండ్ ను విధించిందన్నారు.నాటు సారాయి రవాణా,లేదా తయారీ,చేసిన వారిపై నిఘా పెడుతున్నామని, ఎవరైనా చట్ట విరుద్ధంగా నాటు సారాయి తయారీ లేదా రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,ప్రజలు సహకరించాలని ఎస్సై తెలిపారు.ఈ దాడుల్లో కురుపాం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు కూటమి ప్రభుత్వం అండ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. 2030 నాటికి ప్రతి కుటుంబం నుంచి ఒక పారి శ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొ న్నారు.విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఎంఎస్ఎంఈ బిజినెస్ ఎక్స్‌పో--2026ను శుక్రవారం మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఎక్స్‌పోను ప్రారంభించిన ఆయ న, ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ పరిశ్రమల ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు.ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, స్టార్టప్ తదితర రంగాలకు చెందిన ఉత్పత్తులను పరిశీలించి, ఆయా సంస్థల ప్రతినిధులతో వ్యాపార వివరా లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 187 స్టాళ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని పెంచడం, భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024--29) అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ఐదేళ్లలో ఎంఎస్ ఎంఈ రంగంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 1.75 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంద న్నారు.ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 మైక్రో పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు గైడెన్స్, కన్సల్టెన్సీ సేవలతో పాటు వ్యాపారాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈలకు వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని వివరించా రు.విశాఖ వంటి అభివృద్ధి చెందుతున్న నగరంలో బిజినెస్ ఎక్స్‌పోలు నిర్వహించడం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవే త్తలకు కొత్త అవకాశాలు, మార్గదర్శకత్వం లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకోవడం తో పాటు వ్యాపారాలను విస్తరించి రాష్ట్ర ప్రగతిలో భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు.గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోం దన్నారు. 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం పర్యాటక, పారిశ్రా మిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. త్వరలో విశాఖలో 16 ఫైవ్‌స్టార్ హోటళ్లు అందుబాటులోకి రానున్నాయని, ఇలాంటి ఎక్స్‌పోలు పర్యాటక, వ్యాపార రంగాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఎక్స్‌పో సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు కొనసాగ నుంది.

## పింఛన్ల దరఖాస్తు గడువు పెంచాలని నిరసన

- లక్ష్మీపురం స్వర్ణ గ్రామ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ఆందోళన.
- లక్ష్మీపురం మాజీ సర్పంచ్ కొర్రా త్రినాధ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 11.**ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు దరఖాస్తు గడువు పెంచాలని మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో గల స్వర్ణ గ్రామ కార్యాలయం ఎదుట పెన్షన్ లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు లక్ష్మీపురం మాజీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు తర్వాత పెన్షన్స్ దరఖాస్తులు తీసుకోవడంతో వృద్ధాప్య, వితంతువు అంగవైకల్యం ఇతర పెన్షన్స్ ల అర్హత గల లబ్ధిదారులు ఎక్కువ మంది ఉన్నారని, ప్రభుత్వం ఇచ్చిన తక్కువ సమయం, అలాగే మూడు రోజుల పాటు వరుసగా సెలవులు రావడంతో పని దినాలు తక్కువగా ఉందనీ అందుచేత అర్హత ఉన్న లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. గిరిజన ప్రాంతంలో వర్షాలు ఉండడంతో స్వర్ణ గ్రామ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అప్డేట్స్ డేటా కోసం సిస్టమ్స్ స్లో గా ఉండడంతో ఎక్కువ సమయం తీసుకుంటుందని ఆయన అన్నారు. దీంతో అర్హులైన ఎక్కువ మంది లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి పెన్షన్ దరఖాస్తులు గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు గడువు పెంచకపోతే లబ్ధిదారుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పరిధిలో గల పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పెన్షన్ దరఖాస్తుల గడువు పెంచాలి



- లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి జనసేన ప్రత్యేక శిబిరాలు
- మూడు వార్డుల్లో మూడు రోజుల పాటు సేవలు
- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను పరిష్కరించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు, గ్రేటర్ విశాఖ సిటీ జనసేన అధ్యక్షులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ గారికి వినతిపత్రం అందజేశారు. జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు గారి సారథ్యంలో 71వ వార్డు జనసేన నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, 72వ వార్డు జనసేన నాయకులు ధవళ గోపాల వెంకటరమణ, 73వ వార్డు జనసేన నాయకులు గేదెల మురళీకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఆయా వార్డుల్లో కొత్త పెన్షన్ దరఖాస్తుల నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ శిబిరాలకు లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభించింది. పెన్షన్ కోసం శిబిరాలకు వచ్చిన లబ్ధిదారుల దరఖాస్తులను కార్యకర్తలు దగ్గరుండి పూర్తి చేయించారు. అనంతరం గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించి, లబ్ధిదారుల పేర్లు నమోదు అయ్యేలా కార్యకర్తలు స్వయంగా వారికి సహకరించారు. గత మూడు రోజులుగా సచివాలయాలకు వెళ్లి దరఖాస్తుల నమోదు ప్రక్రియలో లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు విశేష సేవలు అందించారు. అయితే సచివాలయాల్లో సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పెన్షన్ దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన నాయకులు తెలిపారు. అదేవిధంగా కొంతమంది లబ్ధిదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మ్యాపింగ్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మరికొంతమంది వృద్ధుల కుటుంబ రేషన్ కార్డుల్లో పిల్లల్లో ఒకరికి ఉద్యోగం ఉండటంతో, తల్లిదండ్రులు వేరుగా నివసిస్తున్నప్పటికీ పెన్షన్ దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 16వ తేదీ చివరి గడువుగా ఉండగా, వరుసగా శని, ఆది, సోమవారాల్లో సచివాలయాలకు సెలవులు రావడంతో లబ్ధిదారులకు దరఖాస్తులు సమర్పించుకునేందుకు తగినంత సమయం లేకుండా పోతోందని జనసేన నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సర్వర్ సమస్యలు, ధ్రువీకరణ పత్రాల మ్యాపింగ్ సమస్యలు, సచివాలయాల సెలవులు తదితర కారణాల వల్ల చాలామంది అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించుకోలేకపోతున్నారని తెలిపారు. అందువల్ల పెన్షన్ దరఖాస్తుల గడువును మరికొంతకాలం పొడిగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా జనసేన పార్టీ తరఫున తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కంపర కోటేశ్వరరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి



ఎంపీ మూతుకుమిల్లి భరత్‌ను కలిసిన విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణులు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు విశాఖ పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ మూతుకుమిల్లి శ్రీ భరత్‌ను కలిశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీకి అందజేసి, ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం రిజిస్ట్రేషన్ నెం. 500/82 అధ్యక్షులు కోడూరు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోట నరేష్ తదితరులు ఎంపీ భరత్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. సంఘం అధ్యక్షులు కోడూరు గణపతిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెన్షన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అయితే కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న నాయి బ్రాహ్మణులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో నాయి బ్రాహ్మణులకు 50 సంవత్సరాలకే పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కొన్ని చేతివృత్తుల బీసీ కులాలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అందుతున్న నేపథ్యంలో నాయి బ్రాహ్మణులను కూడా అదే పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఎంపీ భరత్‌ను విజ్ఞప్తి చేశారు. నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోట నరేష్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో డీజేలు విస్తృతంగా వినియోగంలోకి రావడంతో సంప్రదాయ మంగళ వాయిద్యాలు, బ్యాండ్, సన్నాయి మేళం వంటి కళలకు ఆదరణ తగ్గిపోతోందన్నారు. ఈ కళలను, వాటిపై ఆధారపడి జీవిస్తున్న కళాకారులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం జిల్లాలో సుమారు 1,000 గజాల స్థలంలో సంగీత పాఠశాలను ఏర్పాటు చేసి, సంప్రదాయ వాయిద్య కళలను భవిష్యత్ తరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంగీత పాఠశాల ద్వారా యువతకు శిక్షణ అందించి, అంతరించిపోతున్న సంప్రదాయ మంగళ వాయిద్య కళలకు పునరుజ్జీవనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు మాట్లాడుతూ సమాజంలో నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న వివక్ష, అవమానాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జీవో నెం.50ను అనుసరించి నాయి బ్రాహ్మణుల రక్షణకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకుని, అవసరమైన సందర్భాల్లో అట్రాసిటీ చట్టం వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే నాయి బ్రాహ్మణుల కులవృత్తిని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అనంతరం వినియోగించే విద్యుత్‌కు సంబంధించి అదనపు బిల్లును వాణిజ్య విద్యుత్‌గా కాకుండా డొమెస్టిక్ కేటగిరీలో పరిగణించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ భరత్‌కు విజ్ఞప్తి చేశారు. నాయి బ్రాహ్మణుల జీవనోపాధి, కులవృత్తి పరిరక్షణ, సంప్రదాయ కళల అభివృద్ధి, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కోడూరు చంద్రకళ, నాయి బ్రాహ్మణ నాయకులు, అధికార ప్రతినిధి బల్లంకి వెంకట్రావు, అదనపు కోశాధికారి మల్లువలస వర్మ, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పశ్చిమ గోల్కొండ కర్ణాకర్, ఉత్తరం పైడివాడ శ్రీనివాసరావు, దక్షిణం చల్లపల్లి శ్రీను, ఎస్.కోట తెలుగుగ్రాపు సుందర్రావు, మల్కాపురం అధ్యక్షులు గోల్కొండ రామకృష్ణ, తగరపువలస అధ్యక్షులు ఎర్రవరపు శంకర్రావు, డాబాగార్డెన్ అధ్యక్షులు గూడుపువలస సతీష్, చింతపల్లి సూర్యనారాయణ, గోలజాపు అప్పారావు, నల్లబిల్లు సత్యనారాయణ, ఎల్.ఏ. నాయుడు, పాతర్లపల్లి ఆనంద్, తిడ రాము, మీసాల రామారావు, చెప్పాడా కనకరాజు, సంతోష్, చింత ఆంజనేయులు, ఏనుగుతల రామారావు, పట్నాల సింహాద్రి, అల్లవరపు నాగేశ్వరరావు, ఉప్పాడ నరసింహులు, కే. బుచ్చిబాబు, వంతరాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగరాలి

- కష్టపడి పనిచేసిన వారికి సముచిత ప్రాధాన్యం
- గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక: ఎమ్మెల్యే వంశీకృష్ణ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకు ని విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివా స్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి పార్ల మెంట్ పరిధికి చెందిన పార్టీ సమన్వయ కమిటీ, సపోర్టింగ్ టీమ్స్ ప్రతినిధులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమావేశ మయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్న ద్ధం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ఎన్నికల కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చిం చారు.ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు, నిర్ణయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచే యాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి నగర స్థాయి వర కు పార్టీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, జనసైనికుల సేవలను గుర్తిం చి వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలు, ప్రజల్లో ఆదరణ, క్షేత్రస్థాయిలో పనిచేసే సామర్థ్యాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.100 శాతం గెలుపే లక్ష్యం గా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, ప్రతి స్థానంలో పార్టీ విజయానికి సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. జనసేన బలం నాయకుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రతి జనసైనికుడిలో ఉందన్నారు.విశాఖపట్నం, అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గం, వార్డు, గ్రామంలో పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసు కోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో జనసేనకు ఘన విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ఎన్నికల విజయాలుగా మలచేందుకు ఇప్పటి నుంచే సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు, సపోర్టింగ్ టీమ్స్ ప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## కంపరేగుల చెక్ డామ్ మంజూరు చెయ్యండి...!

- గిడ్డి ఈశ్వరి కి ఐటిడిపి కోఆర్డినేటర్ జంపా వెంకటరమణ విజ్ఞప్తి...



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 11:**తెలుగు దేశం పార్టీ ప్రతి శుక్రవారంనిర్వహించే పి జి ఆర్ ఎస్ లో పాడేరు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇంచార్జి. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యం క్యాంప్ ఆఫీస్ లో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో నడింపాలెం పంచాయతీ . కంపరేగుల గ్రామం లో తెగునుపాటు గెడ్డ వద్ద చెక్ డామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలని కోరారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరికి జంపా వెంకటరమణ వివరిస్తూ పుష్కలమైన నీటి వనరులు ఉన్నా. భూములు బీడు వారే దౌర్భాగ్యం ఏర్పడిందని. హెల్ నినో ప్రభావం వల్ల. వర్షాలు లేక భూములు బీడు వారి ఉన్నాయని. కంపరేగుల గ్రామంలో తెగును పాటు గెడ్డ వద్ద చెక్ డామ్ నిర్మిస్తే దాదాపు 200 ఎకరాలు నిత్యం సాగులో ఉంటుందని. కంపరేగుల. శరభన్న పాలెం. బట్టు మెట్ట. గ్రామాలలో రైతులు కు మేలు కలుగుతుందని అన్నారు. ఉన్నత అధికారులతో మాట్లాడి చెక్ డాం నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆమెను కోరారు. ఆమె సానుకూలంగా స్పందించినట్లు వెంకటరమణ తెలిపారు.

## 14 ఎంపీటీసీ ఎన్నికలకు ఓటర్లు జాబితా ప్రదర్శన...!

ఎంపీడీవో జీడివి ప్రసాద్ వెల్లడి.




**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 11:** కొయ్యూరు మండల పరిధిలో ఉన్న( 14 ప్రాదేశిక ,జడ్పీటీసీ స్థానాలకు ) ఎంపీటీసీ,జడ్పీటీసీ స్థానాలకు మండలంలో సిద్ధం చేసిన ఓటర్లు జాబితా ను విడుదల చేస్తూ ఎంపీడీవో జీడివి ప్రసాద్ ప్రచురణ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో ఈ ఓటర్ల జాబితా విడుదల చేసి అన్ని సెగ్మెట్లు కు తగిన సమాచారం తెలియజేసినట్టు ప్రకటించారు.ఈ కొయ్యూరు మండలంలో ఉన్న 33 పంచాయితీల్లో మొత్తం 43711 మంది ఓటర్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 20835 మంది కాగా,మహిళలు 22876 మంది ఉన్నారని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు. వీటికి సంబంధించినా 14 ఎంపీటీసీ సెగ్మెంట్ లకు ప్రచురణ చేయడమైనట్టు తెలిపారు. అలాగే ప్రతి సెగ్మెంట్ కు సెగ్మెంట్ ల వారిగా ఓటర్ల జాబితా వివరాలను నివేదించినట్టు ఎంపీడీవో తెలిపారు.ఈ నెల 15 న డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితా పబ్లికేషన్ చేయనున్నట్టు ప్రకటించారు. 15 నుంచి 19 తేదీ వరకు ఎలెక్షన్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల మేరకు వీటి వివరాలకు గల సర్క్యులర్ ద్వారా ఆయా సెగ్మెంట్ లకు తెలియజేసినట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.

## ఏఎస్ఆర్ జిల్లాలో పోషణ్ మాహ్ కార్యక్రమాలు



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 2,357 అంగన్వాడీ కేంద్రాల్లో 9వ జాతీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి, సాధికారిత అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో 5,550 మంది గర్భిణీలు, 3,535 మంది బాలింతలు, 56,465 మంది పిల్లలకు పోషకాహారం, ఆహార వైవిధ్యం, ప్రోటీన్ ప్రాధాన్యత, మాతృ ఆరోగ్యం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించనున్నారు. "హమారీ అంగన్వాడీ -- హమారీ జిమ్మేదారీ" ప్రధాన థీమ్‌గా పోషణ్ మేళాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, వంటకాల ప్రదర్శనలు నిర్వహించనున్నారు.అలాగే తొలి 1,000 రోజుల ప్రాధాన్యత, బాలల ప్రాథమిక అభివృద్ధి, ప్రధానమంత్రి మాతృ వందన యోజన ( పిఎంఎంవివై )పై అవగాహన కల్పించనున్నారు. ప్రజలు, తల్లిదండ్రులు, కమ్యూనిటీ సభ్యులు కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని అధికారిణి కోరారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సత్కారం

- విద్యాభివృద్ధికి రెండు దశాబ్దాలుగా విశిష్ట సేవలు
- విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న బి. పేరి నాయుడు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :**గ్రేటర్ విశాఖపట్నం 92వ వార్డు పద్మనాభనగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి. పేరి నాయుడు ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్న సందర్భంగా పద్మనాభనగర్ పాఠశాల విద్యా కమిటీ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ.. బి. పేరి నాయుడు గత రెండు దశాబ్దాలకు పైగా విద్యారంగానికి ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు కేవలం పుస్తకాల్లోని పాఠాలను బోధించడమే కాకుండా, జీవితంలో ఎలా నడుచుకోవాలి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎలా ఎదగాలి అనే విషయాలను కూడా వివరిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించడం పేరి నాయుడు ప్రత్యేకత అని పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, పాఠశాల అభివృద్ధికి కూడా తనవంతు సహకారం అందిస్తున్న పేరి నాయుడుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు దక్కడం గ్రామానికే గర్వకారణమని సోములు అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత విజయాలు, పురస్కారాలు సాధించి ఉపాధ్యాయ వృత్తికి, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గౌరవ అధ్యక్షులు సాలాపు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని పేరి నాయుడును అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహీత బి. పేరి నాయుడు మాట్లాడుతూ తనపై గ్రామస్తులు, పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూపిన ప్రేమాభిమానాలు, ఆప్యాయత తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని అన్నారు. ఈ సత్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో విద్యార్థుల అభ్యున్నతికి మరింత అంకితభావంతో సేవలందించేందుకు ఇది స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.

## 92వ వార్డులో రూ.49.71 లక్షలతో తార్ రోడ్డుకు శంకుస్థాపన

గణబాబు ఆదేశాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 11** : గ్రేటర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 92వ వార్డు ఎస్సీ, బీసీ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ఆదేశాల మేరకు టీడీపీ 92వ వార్డు ఇంచార్జ్ దాడి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో సుమారు రూ.49.71 లక్షల వ్యయంతో తార్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ కాలనీలో రహదారి సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టడం పట్ల ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తార్ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందవరపు సోములు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎర్రచెరువు పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు





- అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట
- నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- వాకర్లకు ఆహ్లాదకర వాతావరణం
- యువత క్రీడా వికాసానికి మౌలిక వసతులు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనులతో పాటు కొత్తపాలెం ప్రాంతంలోని ఎర్రచెరువు సమగ్ర పునరుద్ధరణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఎర్రచెరువు వద్ద జరుగుతున్న పూడికతీత పనులు, చెరువు కట్ట నిర్మాణం (బండ్ ఫార్మేషన్), మురుగునీరు చెరువులోకి చేరకుండా డ్రైన్ డైవర్షన్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి తదితర పనులను ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ ప్రమాణాలను అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పనుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఎర్రచెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక ప్రజలు, వాకర్లకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు చెరువు పరిసరాల్లో అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడరాదని స్పష్టం చేశారు. అదేవిధంగా గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనులను కూడా పరిశీలించిన ఆయన, యువతకు క్రీడా సౌకర్యాలు మెరుగుపరచడం ద్వారా క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువత క్రీడా వికాసానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమవతి, ఈఈ మాధవ్, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభినయంలోనూ ఆవిడ షావుకారే..!



**మహానటి షావుకారు జానకికి ఘనంగా సంస్మరణ**
**గోపాలపట్నం కళా సేవా పీఠం ఆధ్వర్యంలో నివాళులు**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** పౌరాణిక, జానపద చిత్రాలు రాజ్యమేలుతున్న సమయంలో సాంఘిక చిత్రాలతో సామాన్య ప్రేక్షకులకు చేరువైన మహానటి షావుకారు జానకి అని గోపాలపట్నం కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. నటనలో తనదైన ముద్ర వేసి, విభిన్న పాత్రలకు ప్రాణం పోసిన ఆమె తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. గ్రేటర్ విశాఖ గోపాలపట్నంలో గోపాలపట్నం కళా సేవా పీఠం ఆధ్వర్యంలో దివంగత మహానటి షావుకారు జానకి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి కళా సేవా పీఠం ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ.. ఏడున్నర దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో షావుకారు జానకి ఎన్నో విలక్షణమైన పాత్రలను పోషించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. కంటతడి పెట్టించే పాత్రలతో కదిలించినా, తన సహజమైన నటనతో ఆకట్టుకున్నా, హాస్యంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించినా ఆమెకే సాధ్యమైందన్నారు. సినీ రంగానికి సుదీర్ఘకాలం సేవలందించిన ఆమె ప్రస్తుతం మన మధ్య లేకపోయినా 'షావుకారు'గా ప్రేక్షకుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కళా సేవా పీఠం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు మాట్లాడుతూ.. పాత్రకు ప్రాణం పోసిన గొప్ప నటి షావుకారు జానకి అని అన్నారు. దక్షిణాది సినీ స్వర్ణయుగంలో మేలిమి బంగారం వంటి ఎందరో నటీమణుల సరసన ఎదిగి, తన నటనా ప్రతిభతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని తెలిపారు. పౌరాణిక, జానపద చిత్రాలు ఎక్కువగా తెరకెక్కుతున్న సమయంలో తాను ఆ తరహా పాత్రలకు సరిపోనని గుర్తించి, స్వీయ నియంత్రణతో సాంఘిక కథానాయికగా తన ప్రస్థానాన్ని కొనసాగించారని చెప్పారు. అగ్ర కథానాయకులకు దీటుగా తన భావాలను పలికిస్తూ, పాత్రల్లో జీవించి నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కళా సేవా పీఠం మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు మాట్లాడుతూ.. షావుకారు జానకి దాదాపు 400 చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. 1950 నుంచి 2023 వరకు సుమారు ఏడున్నర దశాబ్దాల పాటు సినీ పరిశ్రమలో కొనసాగిన ఆమె చివరి చిత్రం 'అన్నీ మంచి శకునములే' అని గుర్తుచేశారు. 94 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని చూసిన షావుకారు జానకి ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించారని, తెలుగు ప్రేక్షకులు ఆమెను ఎప్పటికీ మర్చిపోలేరని అన్నారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు మాట్లాడుతూ.. 'షావుకారు' చిత్రం ఘనవిజయం సాధించడంతో జానకి పేరు ముందు షావుకారు అనే పేరు ఇంటిపేరుగా మారిపోయిందన్నారు. 1950 నుంచి 1973 వరకు కథానాయికగా వెండితెరపై వెలుగొందిన ఆమె, అనంతరం తల్లి, అక్క, వదిన, బామ్మ తదితర విభిన్న పాత్రల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు. కన్యాశుల్కం, రోజులు మారాయి, డాక్టర్ చక్రవర్తి, అక్కచెల్లెల్లు, ఖైదీ బాబాయ్, పసుపు కుంకుమ, జయం మనదే, సొంత ఊరు, తయారమ్మ బంగారయ్య, మజ్ను, సంసారం ఒక చదరంగం వంటి ఎన్నో ఆణిముత్యాల్లాంటి చిత్రాల్లో ఆమె నటన చిరస్మరణీయమని పేర్కొన్నారు. షావుకారు జానకి మరణం తెలుగు సినీ కళారంగానికి తీరని లోటని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు పేర్కొన్నారు. ఆమె నటనా ప్రస్థానం భావితరాల నటీనటులకు స్ఫూర్తిదాయకమని, పాత్ర ఏదైనా అందులో పూర్తిగా ఒదిగిపోయే సహజ నటన ఆమె సొంతమని అన్నారు. ఈ కార్యక్రమంలో మిద్దె అప్పారావు, ఎం.ఎన్.వి. శ్రీనివాస్, కె. వెంకట్, భాస్కర్ పాణిగ్రహి, వల్లూరి జగదీష్, ఏ. విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని షావుకారు జానకి సినీ సేవలను స్మరించుకున్నారు.

# డ్రగ్స్ కు నో చెప్పండి - వికసిత భారత్ ను నిర్మిద్దాం:

- గ్రామీణ వైద్యుల భారీ అవగాహన సదస్సు
- యువత డ్రగ్స్ బారిన పడడం వెనుక విదేశీ కుట్ర - డా.శ్రీనివాస గొల్లంగి
- ప్రధాని మోదీ పిలుపుతో గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఉద్యమం

**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 11:** దేశ యువతను డ్రగ్స్ బారి నుండి కాపాడి, ఆరోగ్యవంతమైన యువతతో వికసిత భారత్ ను నిర్మించాలనే లక్ష్యంతో నగరంలో ప్రైవేట్ హోటల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు..జాతీయ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఏపీ మరియు జాతీయ ఆర్ఎంపి,పిఎంపి సంఘాల సమైక్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీనియర్ కన్సల్టెంట్ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ డా.శ్రీనివాస గొల్లంగి మాట్లాడుతూ "నేటి యువతను డ్రగ్స్ కు అలవాటు చేయడం వెనుక ప్రపంచ దేశాల కుట్ర ఉంది. డ్రగ్స్ వలన ఆరోగ్య సమస్యలు తీవ్రంగా పెరుగుతున్నాయి. యువతలో చైతన్యం తీసుకురావడం చాలా ముఖ్యం"అని అన్నారు.కార్డియాలజిస్ట్ డా.కే.గణేష్ కుమార్.మాట్లాడుతూ, డ్రగ్స్ వలన గుండె సంబంధిత తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించేందుకు గ్రామీణ వైద్యుల సంఘాలు కలిసి పనిచేయాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా స్కూళ్లు, కళాశాలల్లో అవగాహన సదస్సులు,పబ్లిక్ ర్యాలీలు, మీడియా ద్వారా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండిశెట్టి సురేష్ బాబు, బి.ఆర్.ఆంజనేయులు, విశాఖ అధ్యక్షులు ఆర్.ఎస్. నాయుడు మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## నీటి వనరులు వ్యవసాయ భూముల అభివృద్ధికి ప్రాధాన్యత...!

గ్రామ స్వరాజ్య సమితి రైతులతో ముఖా ముఖి లో ఎంపీడీవో ప్రసాద్.




**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 11 :** ప్రస్తుత కాలంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల్లో నెలకొన్న నీటి సంరక్షణ వ్యవసాయ భూముల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించే విధంగా గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రోత్సాహం అందించాలని నిర్ణయం చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధులు అన్నారు. దీనిలో భాగంగానే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖా ముఖి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో జీడివి ప్రసాద్, ఎన్ ఆర్ జి ఎస్ ఏ పి ఓ అప్పలరాజు గ్రామ స్వరాజ్య సమితి సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఈ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ స్వరాజ్య సమితి ప్రతినిధులు మాట్లాడుతూ... రైతులకు ఏ విధమైన సౌకర్యం కల్పించాలనే దానిపైతెలుసుకున్నారు. శరభన్నపాలెం,నడింపాలెం,బట్టపనుకుల, పి. మాకవరం కినపర్తి పంచాయితీ పరిధిలో ప్రకృతి వ్యవసాయం,నీటిపారుదల వంటి అంశాలపై పనిచేస్తుందని సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డి వై నాయుడు తెలిపారు. నీటి వనరుల సంరక్షణ, వ్యవసాయ నీటి కాలువల నిర్వహణ , నీటి యాజమాన్యం వంటి వాటిపై ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఏపీఓ అప్పలరాజు మాట్లాడుతూ పంట కాలువల నిర్మాణం,చెక్ డామ్ లు వాటి మరమత్తులు 60:40 శాతం విధంగా అభివృద్ధి చేసుకోవచ్చునని తెలిపారు. పంట కాలువల్లో మట్టిపనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేసుకోవచ్చునని తద్వారా నీటి నిర్వహణ, సరఫరా సంరక్షణ, సుస్థిర వ్యవసాయ పనులను చేసుకోవచ్చుననితెలియజేశారు.ఈకార్యక్రమంలో రైతు లు సంస్థప్రతినిధులు పాల్గొన్నారు.

## దారకొండ--సీలేరు ప్రాంతంలో ఎడతెరిపిలేని వర్షం

24 గంటలుగా కురుస్తున్న వాన.. పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11**:ఆంధ్రా బోర్డర్ ప్రాంతంలో తుపాను ప్రభావంతో దారకొండ, సీలేరు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. గురువారం ప్రారంభమైన వర్షం శుక్రవారం రాత్రి వరకు 24 గంటలు గడిచినా కొనసాగుతూనే ఉంది. దీంతో మారుమూల ప్రాంతాల్లో జనజీవనం కొంత ఇబ్బందులకు గురవుతోంది. ఎడతెరిపిలేని వర్షాలతో పరిసర ప్రాంతాల్లోని వాగులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండటంతో స్థానికులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం మరికొంతకాలం కొనసాగితే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పోక్సో చట్టం, బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం

మహిళల భద్రత, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై అవగాహన.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 11.** మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ, నందిమెట్టలో పోక్సో చట్టం, బాల్యవివాహాలపై, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, నాటు సారా మరియు గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలు, మహిళల భద్రతతో పాటు ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ముంచంగిపుట్టు ఎస్సై పీ నాని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ.. బాలకులపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడానికి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ చట్టం కింద ఉండే కఠిన శిక్షల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, బాలికల ఆరోగ్యం మరియు చదువుపై పడే ప్రభావం గురించి వివరిస్తూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని ప్రోత్సహించినా లేదా నిర్వహించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు మరియు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు.

## అగ్నికి ఆహుతైన ద్విచక్ర వాహనం.


- గుమ్మలక్ష్మీపురంలో ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతి.



**గుమ్మలక్ష్మీపురం సెప్టెంబర్ 11. పెన్ పవర్.** మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో శుక్రవారం నాడు, ఆకస్మికంగా వాహనం షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. కురుపాం మండల, వాహన యజమాని కిరణ్ కుమార్. ఈ మేరకు ఆయన ఇచ్చిన సంమాచారం మేర ద్విచక్ర వాహనం ఆపిన కొద్దిసేపటికే వాహనం నుండి పొగలు రావడం గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చామని వారు హటాహుటిన వచ్చే మంటలను అదుపు చేశారన్నారు. ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదాలు జరగలేదని కిరణ్ కుమార్ తెలిపారు.

## పింఛన్ దరఖాస్తుల ఆన్‌లైన్‌లో ఆర్.వీ.నగర్ సచివాలయం దూకుడు

74 పింఛన్ దరఖాస్తులు ఆన్‌లైన్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** మండల పరిధిలోని ఆర్.వీ.నగర్ సచివాలయం ప్రజలకు సేవలందించడంలో ముందంజలో నిలిచింది. మూడు రోజుల్లో సచివాలయానికి 77 పింఛన్ దరఖాస్తులు రాగా, వాటిలో 74 దరఖాస్తులను డిజిటల్ అసిస్టెంట్ వీర్రాజు ఆన్‌లైన్ చేశారు. దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్ చేయడంపై సచివాలయ సిబ్బందిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సచివాలయాన్ని సందర్శించిన స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అరికట్ల ఆంజనేయులు డిజిటల్ అసిస్టెంట్ వీర్రాజును అభినందించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ సేవలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సేవా ప్రేమ్‌కుమార్, స్థానిక ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీలేరు ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరగడంతో అంతరాయం

రెండు గంటలపాటు నిలిచిన వాహనాల రాకపోకలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** జీకే వీధి మండలం సీలేరు–ఐస్‌గెడ్డ ప్రధాన రహదారిలో జొన్నమామిడి గ్రామం సమీపంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా నేలకొరిగింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. చెట్టు రహదారికి అడ్డంగా పడటంతో సుమారు రెండు గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలంలో ఆర్అండ్‌బీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు, సమీప గ్రామస్తులు కలిసి చెట్టును తొలగించారు. చెట్టు తొలగింపు కోసం వాహనదారుల నుంచి కొంత మొత్తాన్ని సేకరించి, తొలగింపు పనుల్లో పాల్గొన్న వారికి అందించినట్లు సమాచారం. చెట్టు తొలగింపు అనంతరం సుమారు రెండు గంటల తర్వాత వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ప్రధాన రహదారులపై ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే స్పందించేలా సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండాలని వాహనదారులు కోరుతున్నారు.

## పాడి రైతులకు వరంగా పశు సంవర్ధక శాఖ పథకం.



.75 శాతం సబ్సిడీతో గడ్డి కోసే యంత్రాలు.50 శాతం సబ్సిడీతో సమీకృత దాణా

పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే.

**గుమ్మలక్ష్మీపురం సెప్టెంబర్. పెన్ పవర్.** పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పశుసంవర్ధక శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ద్వారా మంజూరైన వివిధ పథకాల లబ్ధిని అందజేశారు. ఈ సందర్భంగా పశువుల పశుగ్రాసం కోసం 75 శాతం సబ్సిడీతో గడ్డి కోసే యంత్రాలను,50 శాతం సబ్సిడీతో సమీకృత దాణాను పాడి రైతులకు అందించారు. అలాగే పశుగ్రాస విత్తనాలను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పాడి రైతుల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అధిక సబ్సిడీలతో వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు పాడి రంగంలోకి మరింతగా వచ్చి స్వయం ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. పశుపోణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడేలా ప్రభుత్వం అవసరమైన చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుపాం మండల పశు వైద్యాధికారి డా. శైలజ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, మహిళా పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి.

ఎంపీపీ,జడ్పీటీసీ స్థానాలు ఎస్టి లకు అవకాశం కల్పించాలి--ఆరిక చంద్రశేఖర్

**జియ్యమ వలస సెప్టెంబర్.11 పెన్ పవర్.** జియ్యమ్మవలస మండలంలో సుమారు 35 శాతం గిరిజన జనాభా ఉన్నప్పటికీ, గత 25 సంవత్సరాలుగా మండల పరిషత్ అధ్యక్షుడు(ఎంపీపీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(జడ్పీటీసీ) వంటి కీలక పదవుల్లో గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం బాధాకరమని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ మండిపడ్డారు. మండలములో 2011 జనాభా లెక్కకు ప్రకారం30% గిరిజనులు ఉన్నప్పటికీ రాజకీయ హక్కులకు, ప్రాతినిధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గత 25 సంవత్సరాల రిజర్వేషన్ రోస్టర్‌ను సమగ్రంగా పరిశీలించి, ఇంతకాలం గిరిజనులకు అవకాశం ఎందుకు రాలేదో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 2026 స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ రోస్టర్ లో జియ్యమ్మవలస మండలానికి ఎంపీపీ, అధ్యక్ష పదవిని, అలాగే జడ్పీటీసీ, స్థానాన్ని చట్టబద్ధమైన రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఎస్టి లకు కేటాయించాలని కోరారు. గిరిజనుల జనాభా నిష్పత్తిని, గత రిజర్వేషన్ రోస్టర్ ను, గిరిజన ప్రాంతములో ప్రత్యేకతను పరిగణనలోకి తీసుకోకుండా రిజర్వేషన్ కేటాయిస్తే గిరిజనులకు మరోసారి అన్యాయం జరుగుతుందని అన్నారు. 25 ఏళ్లుగా అవకాశం రాకపోవడం గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రశ్నార్థకంగా



మారింది. ఈసారి కూడా గిరిజనులకు అవకాశం ఇవ్వకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో మా హక్కుల కోసం న్యాయ పోరాటాన్ని ఉధృతం చేస్తాం అని ఆరిక చంద్రశేఖర్ హెచ్చరించారు. రిజర్వేషన్ రోస్టర్‌ను పారదర్శకంగా రూపొందించి, గిరిజనులకు న్యాయం చేయాలని జిల్లాఅధికారులను, సంబంధిత ఎన్నికల అధికారులను కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేసిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం సెప్టెంబర్ 11 పెన్ పవర్.** కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి లబ్ధిదారులకు అందజేశారు. గరుగుబిల్లి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన దత్తి శ్రీదేవి రూ.73,390 విలువైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన వారికి సత్వర ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అనేక మంది పేద కుటుంబాలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం మెరుగైన వైద్యం పొందుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో కురుపాం నియోజకవర్గానికి అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరయ్యేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. కష్టాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటకరంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు, కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు భూమి విస్తీర్ణం కాదు - ఆదాయమే పెన్షన్‌కు ప్రామాణికం కావాలి

కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 11.** ఆదివాసీలకు సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేసే విషయంలో కేవలం భూమి విస్తీర్ణాన్ని ప్రామాణికంగా తీసుకుని అర్హతను నిర్ణయించడం అన్యాయమని, కుటుంబానికి వస్తున్న వాస్తవ ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతాల్లోని పోడు, కొండ, మెట్ట భూములను మైదాన ప్రాంతాల్లోని సాగుభూములతో సమానంగా చూడటం సరికాదన్నారు. కొన్ని కుటుంబాలకు ఎక్కువ ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ఆ భూమి సాగుకు అనుకూలంగా లేకపోవడం, నీటి వసతి లేకపోవడం, పంట దిగుబడి తక్కువగా ఉండటం వల్ల స్థిరమైన ఆదాయం లేని పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. కేవలం భూమి ఎన్ని ఎకరాలు ఉందనే కారణంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన పేదలకు సామాజిక భద్రతా పెన్షన్లు నిరాకరించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నీలకంఠం అన్నారు. ఆదివాసీ ప్రాంతాల భౌగోళిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిదంగా ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పెన్షన్ మార్గదర్శకాలు రూపొందించాలని, భూమి విస్తీర్ణం కారణంగా ఇప్పటికే తిరస్కరించిన పెన్షన్ దరఖాస్తులను జిల్లా స్థాయిలో పునపరిశీలించాలన్నారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, భూమి స్వభావం, సాగు పరిస్థితులు, పంట దిగుబడి, కుటుంబ వాస్తవ ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలనీ, అర్హులైన ఆదివాసీ పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యేక మార్గదర్శకాలు లేదా జివో జారీ చేసి సమస్యను పరిష్కరించకపోతే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వెంగడ నీలకంఠం ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి.

- డిసిసి పర్యటన రూట్ మ్యాప్ ఖరారు.
- జిల్లా ఎన్నికల మోనటరింగ్ కమిటీ ఏర్పాటు.



**పార్వతీపురం సెప్టెంబర్ 11 పెన్ పవర్.** కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ పార్టీ డిసిసి పార్వతిపురం జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్వతీపురంలో జిల్లా పార్టీకార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ సి.సి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఏపీ సీ.సీ ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలనిపిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో స్థానిక ఎన్నికలను సమన్వయం చేసేందుకు పదిమందితో కూడిన జిల్లా ఎన్నికల మోనిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీని నియోజకవర్గం మహిళా, సీనియర్, చురు గా పనిచేసిన నాయకులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 16 నుండి 24 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో డీసీసీ పర్యటన షెడ్యూల్ ఖరారు చేసినట్లు తెలిపారు. 16న గుమ్మలక్ష్మీపురం, కురుపాం, 17న గరుగుబిల్లి, జిఎం వలస, 18న కొమరాడ, పార్వతీపురం, 19న సీతానగరం, బలిజిపేట, 21న సాలూరు మండలం, టౌన్, 22న మక్కువ, పాచిపెంట, 23న వీర ఘట్టం, పాలకొండ, 24న సీతంపేట భామిని మండలాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపల్ చైర్మన్ల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ షెడ్యూల్ ను పార్టీ కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు అనుసరించాలన్నారు. అలాగే జిల్లాలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని బరిలోదిగే అభ్యర్థులతో త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాలూరు కోఆర్డినేటర్ గేదెల రామకృష్ణ, ఓబీసీ చైర్మన్ సిగడాపు బంగారయ్య, జిల్లా వైస్ చైర్మన్ పట్టిక లక్ష్మయ్య, మహిళా అధ్యక్షురాలు గొట్టాపు రేణుక, స్పోర్ట్స్ సెల్ అధ్యక్షులు గంట మోహన్ రావు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మండల అధ్యక్షులు మీసాల ఫ్రాన్సిస్, కోలక జయరాం, యూత్ అధ్యక్షులు పాలక సంపత్ కుమార్, కిసాన్ సెల్ అధ్యక్షులు బోను శంకరరావు, మాజీ ఎంపీటీసీ చొక్కాపు సత్యంనాయుడు, సీనియర్ నాయకులు పెద్ద తదితరులు పాల్గొన్నారు.

## లంకపాకలు ఘాట్‌లో గ్యాస్ లారీ బోల్తా




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని లంకపాకలు ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం గ్యాస్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి సీలేరులోని హెచ్‌పీ గ్యాస్ గోదాముకు వెళ్లిన లారీ తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదానికి గురైనట్లు సమాచారం. లారీలో ఖాళీ గ్యాస్ సిలిండర్లు ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై సీఐ సుధాకర్ వివరాలు సేకరించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేస్తాం.





వడ్డి రఘురామ్ నాయుడు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సంస్థలు ఎన్నికల సన్నాహాలపై నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.క్రొత్తగా ఐడీ కార్డులు మంజూరైన వైసీపీ నాయకులు కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వెన్నుపోటు పార్టీ వెన్నుపోటు పాలన కార్యక్రమం ద్వారా గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు వివరించారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను బలంగా ఎదుర్కొందామన్నారు. ప్రతిపక్షం మనకు కొత్త ఏమీ కాదని, 2014లో మన పార్టీ గెలవకపోయినా, ఎవరూ అధైర్యపడలేదన్నారు. కలిసికట్టుగా పనిచేసి 2019లో విజయం సాధించామని, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలు చూడకుండా పథకాలు అందజేశామన్నారు. ప్రజా సేవే పరమావధిగా పని చేశామని,. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని, కానీ ఐదేళ్లలో మనం చేసిన మంచిని బలంగా చెప్పుకోలేకపోయామన్నారు. ఐదేళ్ల వైయస్ఆర్ సీపీ పాలనలో కొన్ని విషయాల్లో మనం వెనుకపడ్డామన్నారు. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుందామన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తే అధినేత అని, ఈ విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని, కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని ముందుకు వెళ్తున్నారన్నారు. రెండేళ్ల పాలన అవినీతి నిలయంగా మారిపోయిందన్నారు. మట్టి, ఇసుక, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో తప్పకుండా గెలవాలన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉందామని, పార్టీ నియమించిన అభ్యర్థులను గెలిపిద్దామని కలిసికట్టుగా గ్రామాల్లో అధికార పార్టీని ఎదుర్కొందామన్నారు. బహుశా అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఎన్నికలు ఉంటాయని,. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా ప్రతినిధుల అవినీతితోపాటు సూపర్ సిక్స్ సహా 143 హామీలపై నిలదీద్దామన్నారు.. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు, కూటమి పరిపాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిద్దామన్నారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని, డీఎస్సీలో జరిగిన అక్రమాలు రోజుకొకటిగా బయటపడుతుంటే, అనర్హులే గురువులుగా నియమితులయ్యారని ప్రభుత్వం రహస్య విచారణలతోనే తేల్చేస్తోందన్నారు.. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిజర్వేషన్లతో నడిపిన మెగా డీఎస్సీ పూర్తిగా అక్రమాల పుట్టగా మారిపోయిందన్నారు. నీట్ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నట్లుగానే, రాష్ట్రంలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ లోకేష్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. దేశంలోనే అత్యంత అవినీతిమయమైన పాలనను చూస్తున్నామన్నారు. 2025 ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి పోస్టింగులు ఇచ్చే వరకు ప్రతి అడుగునా అడ్డగోలు అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ స్థాయి నాయకులు, మరియు పట్టణ,మండల, నాయకులు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు..



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, సెప్టెంబర్ 11;** పేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారం తగ్గించేందుకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుక్కునూరు మండలానికి చెందిన పల్లెల మారేశ్వరికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గానికి 28వ విడతగా 51 చెక్కులు మంజూరయ్యాయని, మొత్తం 83 లక్షల 23 వేలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఇళ్లకు నేరుగా వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మంత్రి గోపాలకృష్ణ, చల్ల కోటి, గాడిద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన




**జీలుగుమిల్లి ,పెన్ పవర్, సెప్టెంబర్ 11;** ఎవరైనా ఆన్లైన్ యాప్ మోసాలకు గురి అయినట్లయితే వెంటనే 19 30 కి కాల్ చేసి మీ సమస్యను తెలియజేయాలని జీలుగుమిల్లి సిఐ బి యాదగిరి సూచించారు. శుక్రవారం జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో పోలీసు సిబ్బందికి పోరాంతపు శిక్షణ నిర్వహించి, సెంటర్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అప్రమత్తంగా ఉండాలని డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల బారిన పడకుండా మంచి మార్గాన పయనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేది వరకు జాతీయ పోషకాహార మాసోత్సవములు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేది వరకు జరిగే జాతీయ పోషకాహార మాసోత్సవములు 16వ వార్డ్ లో నిర్వహించరు. ఈ కార్యక్రమంలో పోషకాహర ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమం అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించి తల్లులకు తల్లులకు పోషకహారం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరుగుతుంది అని దాన్లో భాగంగా అంగన్వాడి వర్కర్లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు అందరూ కూడా తమ పరిధిలోని తల్లిలందరికీ పోషకహర ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని ఎక్కువ మాంసపుకృతులు కలిగిన ఆహారం గురించి తెలియజేసి వాటిని వారియొక్క రోజువారీ ఆహారం లో తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేయాలనీ తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్స్ సిహెచ్ దుర్గ భవాని, అంగన్వాడీ వర్కర్స్ మరియు తల్లులు హాజరైనారు.

## బొడ్డగండి పంచాయతీ పరిధిలో ప్రత్యేక పెన్షన్ క్యాంపులు

**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్,సెప్టెంబర్ 11 :** గుర్తేడు మండలం పరిధిలో ఉన్న బొడ్డగండి పంచాయతీ లో ప్రత్యేక పెన్షన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కే బాపన్న దొర తెలిపారు.

ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం బొడ్డగండి పంచాయతీ మారుమూల 13 గ్రామాలలో ప్రత్యేక పెన్షన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అర్హులైన పింఛన్దారులందరూ ఆధార్ కార్డ్ రేషన్ కరెంట్ బిల్లు ఓటర్ ఐడి తో రావాలని అన్నారు. ఆయా పంచాయతీ సెక్రటరీ డిజిటల్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

# రామచంద్రపురంలో జనసేన జోష్..





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**రామచంద్రపురంలోని చందమామ కళ్యాణ మండపం, రాజగోపాల్ సెంటర్ నందు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన రామచంద్రపురం నియోజకవర్గ సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది.అమలాపురం పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించి, సమన్వయంతో ముందుకు సాగేందుకు అవసరమైన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన జెండాలు రెపరెపలాడగా… జనసేన నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లివిరిసింది! ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్థానిక నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వీర మహిళలు మరియు ప్రెస్ ఓ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## మాంటిస్సోరి హైస్కూల్లో ఘనంగా ఏకో ఫ్రెండ్లీ వినాయక చవితి






**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్లో ఏకో ఫ్రెండ్లీ వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు మట్టి వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయకుడిని పూజించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వి.వి.అనీష్ తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వినతి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** పెందుర్తి నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జనసే న పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్య క్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు.విశాఖపట్నం విఎంఆర్డిఏ సమావేశ మందిరంలో శు క్రవారం విశాఖ ఎం.పీ భరత్, జీవీఎంసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి నియోజకవర్గంలోని తాగునీటి సమస్య లపై వినతిపత్రం అందజేశారు.

పెందుర్తిలోని వెంకటాద్రి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉం చుకుని తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పెందుర్తి ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో రోగులు, వారి సహాయకులకు తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అపార్ట్‌మెంట్లు, ఇళ్లలో ఫ్లోరైడ్‌తో కలు షితమైన భూగర్భ జలాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున సురక్షితమైన ట్రీటెడ్ వాటర్ సరఫరా చేయాలని కోరారు. పెందుర్తి, అగనంపూడి జోన్లలోని లోతట్టు, నీటి ఎద్దడి ప్రాంతాల్లో హ్యాండ్‌బోర్లు మంజూరు చేయడంతో పాటు ఎత్తైన ప్రాంతాలకు పీడ బ్ల్యూఎస్ పథకాల ద్వారా తాగునీరు అందిం చాలని సూచించారు.ఇప్పటికే ఉన్న పాత తాగునీటి పథకాలను బలోపేతం చేయాలని, గతంలో ప్రతిపాదించిన పెండింగ్ తాగునీటి పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని తాగునీటి సమస్యలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, సురక్షితమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com